క్లుప్తంగా

వడదెబ్బపై అప్రమత్తం

చిత్తూరు రూరల్(కాణిపాకం): వడదెబ్బపై ప్రజలను అప్రమత్తం చేసే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంఅండ్ హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం అధికారులతో ఆమె సమీక్షించారు. ప్రతి ఒక్కరికి అభయ ఐడీ నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, డీఎంఓ వేణుగోపాల్, ప్రోగ్రాం ఆఫీసర్లు గిరి, ప్రవీణ, అనూష, రామ్మోహన్, ప్రసాద్, శ్రీవాణి పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ఐఆర్‌ఎస్ అధికారులు


స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం ఐఆర్‌ఎస్ అధికారులు చైతన్యకృష్ణ, హర్షిత దర్శించుకుంటున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనాంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. ఈఓ పెంచల కిషోర్ వారికి ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వాసు, బాలాజి పాల్గొన్నారు.

విరివిగా ల్యాబ్ టెస్టులు చేయాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డెంగీ, మలేరియా అనుమానిత కేసులు వస్తే విరివిగా ల్యాబ్ టెస్టులు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఎంఓ వేణుగోపాల్ ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం వారు ల్యాబ్ టెక్నీషియన్లకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అక్కడక్కడా మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ల్యాబ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత కేసులకు విధిగా పరీక్షలు చేయించాలన్నారు. అలాగే 10శాతం ఓపీలో టీబీ పరీక్షలు చేయాలని ఆదేశించారు.

భక్తిప్రపత్తులతో యాగశాల పూజ


యాగశాల పూజ చేస్తున్న వేద పండితులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో గురువారం యాగశాల పూజా కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. శ్రీ షిరిడి సాయిబాబా నూతన మందిరం కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, సోమనాథ పూజ, యాగపూజ, నారాయణ హోమం, సాయంత్రం యాగశాల పూజ, యంత్రస్థాపన, రత్నం న్యాసం, విగ్రహ ప్రతిష్ఠ, బ్రహ్మ, విష్ణు, రుద్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం ఆలయ కుంభాభిషేకం నిర్వహించి స్వామి వారి సర్వదర్శనం కల్పించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ మృతి చెందిన కె.రామయ్యకు మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ నివాళులర్పించారు. ప్రజారోగ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న రామయ్య బుధవారం మృతి చెందాడు. గురువారం ఐరాల మండలంలోని మతంపల్లెకు వెళ్లి అధికారులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేలు అందచేశారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలపై అవగాహన


మాట్లాడుతున్న డీపీటీఓ జగదీష్

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న ఖాళీ స్థలాలను వ్యాపారాల కోసం లీజుకిచ్చేందుకు ఔత్సాహిక వ్యాపారులతో స్థానిక డిపో వద్ద గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డీపీటీఓ జగదీష్, డీఈఈ చెన్నకేశవులు, డీఎం టీకే స్వామి పాల్గొని ఇక్కడి ఖాళీ స్థలాల వివరాలు, వాటి అద్దెలను వివరించారు. ఆసక్తిగల వారు ఇక్కడ స్థలాలను లీజుకు పొందాలని సూచించారు.

చింతచెట్టుకు మంటలు

పుంగనూరు: మండలంలోని మంగళం గ్రామంలో గురువారం చింతచెట్టుకు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డికి చెందిన చింతచెట్టుకు తొర్ర పడి అందులో చెత్త ఉంది. దానిపై గుర్తు తెలియని వ్యక్తులు తాగి పడేసిన సిగరెట్ వేయడంతో మంటలు చెలరేగాయని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- గ్రామాల్లో ఆటలమ్మ, గవదబిళ్లల కేసులపై అప్రమత్తం
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


చికెన్ ఫాక్స్ లక్షణాలు

బంగారుపాళెం: వేసవి కాలం ప్రారంభమైతే చాలు చికెన్ ఫాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో ఉత్పన్నమవుతోంది. ఎండల తీవ్రత కూడా రోజు రోజుకూ పెరుగుతోంది. మరోవైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్ ఫాక్స్, గవదబిళ్లల బారిన పడిన వారు ఉంటున్నారు. వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు పీడిస్తున్నాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నా ప్రధానంగా చిన్నపిల్లలకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారినపడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి సులువుగా వస్తుంది. సాధారణంగా వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిలో ఎక్కువగా ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటిపొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి డాక్టర్లను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి డాక్టర్ల సూచనల మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకిన వారిని మిగతావారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వడమే మంచిది. గవదబిళ్లలు వచ్చినవారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలనే ఇవ్వాలి. చికెన్ ఫాక్స్, గవదబిళ్లలు వచ్చినవారి విషయంలో ప్రజల అపోహలు, మూఢ నమ్మకాలతో వైద్యం చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లలు వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్నపిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి.
–డాక్టర్ శిరీష, వైద్యాధికారి.బంగారుపాళెం

నోటీస్ బోర్డు

నేడు లక్ష కుంకుమార్చన

బంగారుపాళెం: మండలంలో మొగిలివారిపల్లెలోని స్వయంభు పార్వతీ పరమేశరస్వామి దేవస్థానంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శివస్వామి తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనాలని కోరారు.

రామాలయంలో బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు రాములుగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేశారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌పై 5న అవగాహన సదస్సు

చిత్తూరు కలెక్టరేట్: జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలపై ఈ నెల 5న స్థానిక కొంగారెడ్డిపల్లెలోని ఓ భాస్కర హోటల్‌లో సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నారాయణ కళాశాల డీజీఎం కొండలరావు గురువారం విలేకరులకు తెలిపారు. సదస్సుకు నిష్ణాతులైన అధ్యాపకులు విచ్చేస్తారని, 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. దేశంలోని ఐఐటీ, నీట్ కళాశాలల్లో రెండేళ్లలో సీట్లు ఎలా సాధించాలనే అంశంపై నిష్ణాతులు దిశానిర్దేశం చేస్తారని, దీనిని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9959055316, 7337336483 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంబా.. అంబా..!

- నిలిచిన సంచార పశు వాహన ఆరోగ్య సేవలు


నిలిపి వేసిన పశు సంచార వాహనం

గుడిపాల: సంచార పశు ఆరోగ్య వాహన సేవలు దాదాపు నెలరోజులుగా నిలిచిపోయాయి. గుడిపాల పీహెచ్‌సీలో సంచార ఆరోగ్య వాహనాన్ని నిలిపివేశారు. మండల వ్యాప్తంగా ఆవులు, గొర్రెలు, మేకలు సుమారుగా 40వేలకు పైగా ఉన్నాయి. గామీణ ప్రాంతాల్లోని పశువులకు అత్యవసర పరిస్థితుల్లో కూడా మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య వాహనాలను నియోజకవర్గానికి రెండు చొప్పున కేటాయించింది. 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించింది. పాడి రైతులు ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే సంచార వాహనం వెళ్లి ప్రాథమికంగా వైద్యసేవలు అందించేది. మూగజీవాల ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉంటే మండల వైద్యాధికారుల సూచన మేరకు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి, అక్కడ నిపుణులతో వైద్య సేవలందించేవారు. ఏజెన్సీ నిర్వాహకులే సిబ్బందికి జీతాలు, మందులు అందజేసేవారు. ఆ ఏజెన్సీ నిర్వహణ గడువు ముగిసింది. కూటమి ప్రభుత్వం కొత్తగా ఏజెన్సీలకు వాహన నిర్వహణ అప్పగించేందుకు ఒప్పందం ఇంకా కుదుర్చుకోలేదు. దీంతో ఓ వైపు సిబ్బంది ఉపాధిని కోల్పోయారు. మరో వైపు మూగజీవాలకు అత్యవసర వైద్యసేవలు అందక పశుపోషకులు అవస్థలు పడుతున్నారు.

టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా బాలాజి


బాలాజి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న బాలాజికి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాలాజికి టీపీఎస్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

పన్నుల్లో పూర్.. 36 మందికి షోకాజు నోటీసులు

చిత్తూరు అర్బన్: ఆస్తి పన్ను వసూళ్లలో పురోగతి చూపించని 32 మంది ఉద్యోగులకు చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం షోకాజు నోటీసులు జారీ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూలుకు గడువు గత నెల 31తో ముగిసింది. రాష్ట్రంలోని మునిసిపాలిటీలతో పోలిస్తే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ 10వ స్థానంలో నిలిచింది. అయితే పన్ను వసూళ్లలో సచివాలయంలో పనిచేస్తున్న పలువురు కార్యదర్శులు 75 శాతాన్ని చేరుకోలేదంటూ రెవెన్యూ విభాగం అధికారులు కమిషనర్‌కు నివేదిక అందజేసింది. దీని ఆధారంగా వారి సంజాయిషీ కోరుతూ కమిషనర్ షోకాజు నోటీసులు జారీ చేశారు.

వేలంలో రూ.7.50లక్షల ఆదాయం

యాదమరి: యాదమరి సంత వేలం పాటలో రూ.7.50 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎంపీడీఓ వేణు తెలిపారు. గురువారం మధ్యాహ్నం మండలంలోని చిన్నిరెడ్డిపల్లె క్రాస్‌లోని చెత్త సేకరణ కేంద్రం వద్ద సంత నిర్వహణకు బహిరంగ వేలం జిల్లా పంచాయతీ అధికారి పార్వతి పర్యవేక్షణలో నిర్వహించారు. వేలంలో మొత్తం 11 మంది పోటీ పడ్డారు. ప్రభుత్వ పాటగా రూ.3.70 లక్షలు నిర్ణయించారు. వేలంలో చిన్నంపల్లెకు చెందిన జార్జి రూ.7.50లక్షలకు సంత నిర్వహణ హక్కును చేజిక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సుకుమార్ రెడ్డి, సర్పంచ్ ఝాన్సీ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో విశేష కృషి

సిబ్బందికి సన్మానం


అధికారులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు: మున్సిపల్ ఆస్తి, ఖాళీ పన్నుల వసూళ్లలో పలమనేరు మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో స్థానంలోనూ, రీజనల్ స్థాయిలో రెండో స్థానం, జిల్లాలో తొలి స్థానాన్ని సాధించింది. దీంతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం పన్ను వసూళ్లకు కృషి చేసిన ఆర్వో రవిరెడ్డి, ఆర్ఐ యోగరంజని, షరాబు కిరణ్ కుమార్, బిల్ కలెక్టర్లను ఘనంగా సన్మానించారు. వచ్చే ఏడాదిలోనూ మరింత పన్నులు వసూలు చేసి రాష్ట్రంలోనే టాప్‌లో ఉండాలని ఆయన తెలిపారు. మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, డీఈ సురేష్, ఏఈ స్నేహప్రియ పాల్గొన్నారు.

యాళి, సింహ వాహనాలపై అగస్త్యేశ్వరుడు


యాళి వాహనంపై అగస్త్యేశ్వరుడు

చిత్తూరు రూరల్(కాణిపాకం): యాళి, సింహవాహనాలపై అగస్త్యేశ్వరుడు అభయమిచ్చారు. చిత్తూరులోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం పంగుణి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి యాళి వాహనంపై ఊరేగించారు. రాత్రి సింహవాహనంపై ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు




మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ ఉమ, హాజరైన రైతులు

- వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ

తవణంపల్లె: ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం వైపు మరలి ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులే లక్ష్యంగా ముందుకు పోవాలని వ్యవసాయశాఖ చిత్తూరు డివిజన్ ఏడీఏ ఉమ పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై బుధవారం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించి ఏడీఏ మాట్లాడారు. విషరసాయానాల వల్ల ఎన్నో వ్యాధులు ప్రబలతున్నాయని.. పర్యావరణానికి ముప్పు సైతం వాటిల్లుతోందన్నారు. మానవాళి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ, 2025 ఖరీఫ్ వార్షిక ప్రణాళిక సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ నమూనాలైన ఏ గ్రేడ్, ఏటీఎం, సూర్యమండలం, పీఎండీఎస్,ఆర్‌డీఎస్, 5 లేయర్ మోడల్ విత్తశుద్ధి, విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పించాలన్నారు. కవిత, సరిత, నీలకంఠారెడ్డి ఖరీఫ్ వార్షిక ప్రణాళికపై అవగాహన కల్పించారు.అనంతరం వ్యవసాయాధికారి జి. ప్రవీణ్, అభ్యుదయ రైతు వినోద్‌రెడ్డి మాట్లాడారు. ఆముదం పంట సాగు వల్ల మంచి దిగుబడి, ఆదాయం వస్తుందన్నారు. పెరటితోటలు, నవధాన్యాల విత్తన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, రైతులు, వీఏఏలు, వీఓఏలు, వీఓటీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లభ డెయిరీ యాజమాన్యం ఆదుకోవాలి


ప్రమాదంలో కాలిన కార్మికుడి చేయి

చిత్తూరు కార్పొరేషన్: వల్లభ డెయిరీలో ప్రమాదానికి గురైన కార్మికుడికి యాజమాన్యం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాణిపాకం సమీపంలోని వల్లభ డెయిరీలో పెరుగు ఆపరేటర్ యతిరాజుకు కాస్టిక్ సోడా పడి తల, ముఖం, కాళ్లుచేతులు, కళ్లు కాలిపోయాయన్నారు. ప్రస్తుతం ఆ కార్మికుడు తిరుపతిలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడని, అతడికి యాజమాన్యం పూర్తి స్థాయిలో వైద్యం అందించకుండా డిశ్చార్జి చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్మికుడు పూర్తిగా కోలుకునే వరకు యాజమాన్యమే వైద్య ఖర్చులు భరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు ఎలాంటి రక్షణ పరికరాల్లేవ్!

వల్లభ డెయిరీలో 200మంది కార్మికులు పనిచేస్తున్నా వారికి అవసరమైన ఎలాంటి రక్షణ పరికరాలు వినియోగించడం లేదని గంగరాజు ఆరోపించారు. కాళ్లకు కనీసం షూలు సైతం ఇవ్వడం లేదని, ఎక్కువ మందికి ఈఎస్ఐ సైతం వర్తింపజేయడం లేదని పేర్కొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి సబ్సిడీ రుణాలు


రైతులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారులు

గుడిపాల: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను ఇస్తోందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు సాయిసుధ, సాయితేజ కోరారు. గురువారం వసంతాపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నష్టపోతున్న రైతుల కోసం ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌల్ట్రీఫామ్, గొర్రెలు, పాడి ఆవులకు సంబంధించి సబ్సిడీ లోన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. భూమిలేని వారిని కూడా గుర్తించి వారికి ప్రభుత్వ భూమిని లీజుకు ఇస్తూ అందులో పౌల్ట్రీఫామ్‌ను ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పాడి ఆవులు ఉన్న ప్రతి రైతుకు సబ్సిడీపై 50 శాతం రాయితీతో దాణా, ఫీడ్‌ను కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు అబ్దుల్లా, జ్యోత్స్న, రవి, గజపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

–మునిసిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్


మాట్లాడుతున్న కమిషనర్, ఏసీపీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఎక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నా కార్పొరేషన్ అనుమతి పొందాలని మునిసిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. గురువారం నగరంలోని ఫ్లెక్సీలను ప్రింట్ చేసే నిర్వాహకులతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్రతో కలిసి సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, విచ్చలవిడిగా నగరంలో అనధికారిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటం వల్ల నగర సుందరీకరణ దెబ్బతింటోందన్నారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, పర్యావరణానికి ఇబ్బంది తెచ్చిపెడుతోందన్నారు. ఏ కార్యక్రమం కోసం ఎన్ని ఫ్లెక్సీలు ముద్రిస్తున్నారనే వివరాలను నిర్వాహకులు కార్పొరేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బాలాజి పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు


మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం

తవణంపల్లె: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం ఆదేశించారు. గురువారం స్థానిక ఈజీఎస్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమీక్షించారు. మండలంలో జాబ్‌కార్డు ఉన్న వారితో నీటి కుంటల పనులు చేయించాలన్నారు. ఏప్రిల్ నుంచి ఉపాధి కూలీలకు రూ.307 వేతనాలు పెంచామని, కూలీలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పొలాల్లో అన్ని రకాల పండ్ల తోటలు పెంపకానికి అవకాశం ఉందన్నారు. ఈజీఎస్ సిబ్బంది గ్రామాలకు వెళ్లి, కూలీలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బాల, ఈసీ రమ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'



జొన్నగురకలలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, నలిశెట్టిపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని జొన్నగురకల, నలిశెట్టిపల్లెలో గురువారం వైద్యాధికారులు డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కేశవ నారాయణ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం కాపాడడమే లక్ష్యంగా వైద్యసేవలు అందిస్తున్నట్టు చెప్పారు. గర్భవతులు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ఐరన్ మాత్రలు వాడాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎక్కువగా నీళ్లు, మజ్జిగ లాంటివి తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని హనుమంతరాయుని సన్నిధిలోగల వీరాంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవ పోస్టర్లను మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతిలో ఆవిష్కరించారు. గురువారం ఆలయ నిర్వాహకులు తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ 4వ తేదీ నుంచి ప్రారంభంకానున్న బ్రహ్మోత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు – పూతలపట్టు :
95539 55610